# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 82 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 2 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## ఐపీఎస్ అధికారులు బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీగా
పాటిల్ కాంతిలాల్ సుభాష్
గవర్నర్ ఓఎస్‌డీగా
సిరిశెట్టి సంక్రీత్ నియామకం

2లో..



## గవర్నర్ రాధాకృష్ణన్‌తో సిఎం రేవంత్ భేటీ

### కేబినేట్ విస్తరణ, అసెంబ్లీ సమావేశాలపై ఊహాగానాలు

### నామినేటెడ్ ఎమ్మెల్సీలపైనైఆ చర్చించి ఉంటారని టాక్

హైదరాబాద్, జులై 1 (ప్రభాత ఉదయం): రాష్ట్ర కేబినెట్ ను విస్తరించొచ్చు నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ సోమవారం కలుసుకున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సిఎం భేటీ అయ్యారు. రానున్న కొన్ని రోజుల్లో కేబినెట్ విస్తరణ ఉండనున్నదన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ముఖ్యమంత్రి గతవారం ఢిల్లీకి వెళ్లి అక్కడ కాంగ్రెస్ ప్రధాన నాయకులతో కేబినెట్ విస్తరణ గురించి చర్చించారని తెలిసింది. ఐదు నుంచి ఆరుగురు మంత్రులను కేబినెట్ లోకి తీసుకోవడం ఖరారయిందని తెలుస్తోంది. మంత్రి పదవులు వస్తాయని చాలా మంది గత ఆరు మాసాలుగా ఎదురుచూస్తున్నారు.రేవంత్ రెడ్డి, ఆయన 11 మంది కేబినెట్ కొలీగులు 2023 డిసెంబర్ 7న ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యమంత్రి సహా రాష్ట్రానికి గరిష్ఠంగా 18 మంది మంత్రులు ఉండొచ్చు. ఇదిలావుండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నఅసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న బిల్లుల గురించి గవర్నర్‌కు వివరించారని తెలుస్తోంది. ఈ సందర్భంగా నామినేటెడ్ ఎంఎల్‌సిల అంశం కూడా చర్చకు వచ్చిందని తెలుస్తోంది. గత మార్చిలో తెలంగాణ హైకోర్టు గవర్నర్ కోటా కింద నామినేట్ అయిన ఎం.కోదండరామ్, అమీర్ అలీ ఖాన్ నామినేషన్లను కొట్టేసింది. గవర్నర్ ఉత్తర్వును 2023 సెప్టెంబర్ 19న హైకోర్టు కొట్టేసింది. బిఆర్ఎస్ నాయకులు శ్రవన్ దాసోజు, కె. సత్యనారాయణ నామినేషన్లను తిరస్కరించింది. ఆ తర్వాత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, గవర్నర్ కోటా కింద వారి నామినేషన్లను తిరస్కరించారు. గవర్నర్ ఉత్తర్వులను సవాలు చేస్తూ బిఆర్ఎస్ నాయకులు హైకోర్టులో రిట్ పిటీషన్లను దాఖలు చేశారు. గవర్నర్ ఎంఎల్ సిలను నియమించేలా వారు అప్పీలు చేసుకున్నారు. ఈ క్రమంలో సిఎం భేటీలో ఈ అంశాలు కూడా చర్చించి ఉంటారని భావిస్తున్నారు. ప్రధానంగా కేబినేట్ భేటీ, అసెంబ్లీ సమావేశలు, నామినేటెడ్ ఎమ్మెల్సీల అంశాలను చర్చించి ఉంటారని అనుకుంటున్నారు.

## లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం

### బీజేపీని, ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు

శివుడి ఫోటో చూపిస్తూ..
శివుడి నుంచి ప్రేరణ పొందా
దేశమంతా ఏకమై రాజ్యాంగ పరిరోణకు కృషి చేసింది
నోట్ల రద్దు, జిఎస్టీతో దేశం అతలాకుతలం
నీట్ పరీక్షలో అవతవకలపై ఎందుకు చర్చించరు
అధికార బిజెపిని ఏకి పారేసిన విపక్షనేత రాహుల్



న్యూఢిల్లీ, జులై 1 (ప్రభాత ఉదయం): లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగంపై రచ్చ రాజుకుంది. లోక్ సభలో ప్రతిపక్ష నేతగా తన తొలి ప్రసంగంతోనే బీజేపీపై పదునైన విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీని, ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. శివుడి నుంచి తాను ప్రేరణ పొందానని , శివుడి ఫోటోను రాహుల్ గాంధీ లోక్‌సభలో చూపించారు. అయితే స్పీకర్ అభ్యంతరం తెలిపారు. శివుడి ఫోటోను చూపిస్తే తప్పవుతుందా..? అని రాహుల్ ప్రశ్నించారు. శివుడు శాంతికి ప్రతీక, హింసకు వ్యతిరేకమని.. బీజేపీ హిందువులకు వ్యతిరేకమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు రాహుల్. భగవాన్ శివుడి నుంచి తాను ప్రేరణ పొందినట్టు తెలిపారు. దేశమంతా ఏకమై రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేసిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీపేర్కొన్నారు. భారత్ అనే భావన, రాజ్యాంగంతోపాటు భాజపా ఆలోచనలను ప్రతిఘటించిన లక్షలాదిమందిపై గత పదేళ్లలో క్రమపద్ధతిలో దాడి జరిగిందని ఆరోపించారు. తానూ బాధితుడినేనని.. తనపై 20కిపైగా కేసులు మోపారన్నారు. నాకు రెండేళ్ల జైలుశిక్ష పడింది. నా ఇల్లు తీసేసుకున్నారు. ఈడీ ఆధ్వర్యంలో 55 గంటల పాటు విచారణ ఎదుర్కొన్నా అని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై చర్చలో భాగంగా రాహుల్ ప్రసంగించారు. ప్రతిపక్షంలో ఉండటం గర్వంగా, సంతోషంగా ఉందని పేర్కొంటూ.. అధికారంలో కంటే ఇదే ఎక్కువ విలువైనదని, ఇందులో 'సత్యం' ఉందని తెలిపారు. అయితే కాంగ్రెస్ ఎంపీ మాట్లాడుతుండగా ప్రధాని సహా భాజపా ఎంపీలు పదే పదే అభ్యంతరం తెలపడం గమనార్హం. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ఎస్, భాజపాపై విమర్శలు గుప్పించిన రాహుల్ గాంధీ.. సభలో కొన్ని ఫొటోలను చూపించారు. దీనిపై అధికార పక్షం నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. సభలో ఇలాంటి మతపరమైన ఫొటోల ప్రదర్శనకు నిబంధనలు అంగీకరించవని స్పీకర్ ఓం బిర్లా వారించారు. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలగజేసుకుని రాహుల్ వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. హిందువులను హింసావాదులుగా రాహుల్ పేర్కొనడం ఆమోదనీయం కాదని దుయ్యబట్టారు. అటు కేంద్ర మంత్రి అమిత్ షా సైతం విపక్ష నేత క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లకు కారకులైన వారికి.. అహింస గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. అయితే.. తాను భాజపాను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశానని.. ఆ పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్‌లే మొత్తం హిందూ సమాజం కాదని రాహుల్ తెలిపారు. అన్ని మతాలు ధైర్యం, నిర్భయత, అహింస సందేశాలను చాటి చెబుతున్నాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో నీట్, అగ్నివీర్‌ల ప్రస్తావన లేదు. ప్రొఫెషనల్ పరీక్ష అయిన 'నీట్'ను కమర్షియల్‌గా మార్చారు. గతంలో తీసుకొచ్చిన రైతు చట్టాల వల్ల 700 మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. వారికి సంతాపంగా సభలో మౌనం కూడా పాటించలేదు. భాజపా హయాంలో సంస్థలు నిర్వీర్యమయ్యాయి. దేవుడితో ప్రత్యక్షంగా మాట్లాడతానని స్వయంగా ప్రధాని చెప్పారు. భాజపా ప్రభుత్వం.. జమ్మూకశ్మీర్‌ను రెండు ముక్కలు చేసింది. అల్లర్లతో మణిపుర్ అట్టుడికి పోయినా.. ఇప్పటివరకు ప్రధాని వెళ్లలేదు. అక్కడ నా కళ్లముందే పిల్లలపై బుల్లెట్ల

..మిగతా 2లో



## అమల్లోకి వచ్చిన కొత్త న్యాయవ్యవస్థ

### రాజధాని ఢిల్లీలో తొలి కేసు నమోదు

న్యూఢిల్లీ, జులై 1 (ప్రభాత ఉదయం): భారత న్యాయవ్యవస్థలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత కింద తొలి కేసు నమోదైంది. న్యూదిల్లీ రైల్వే స్టేషన్ పరిధిలోని ఓ వీధి వ్యాపారిపై కొత్త క్రిమినల్ కోడ్‌లోని సెక్షన్ 285 కింద పోలీసులు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దేశ రాజధానిలో ఒక వీధి వ్యాపారి రోడ్డుపై వాటర్ బాటిళ్లు, గుట్కా, బీడీ, సిగరెట్లు అమ్మడాన్ని పెట్రోలింగ్ పోలీసులు గుర్తించారు. అతడి తాత్కాలిక దుకాణం ఎన్‌డీఆర్ఎస్ సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ కింద ఉంది. దానివల్ల రహదారిపై రాకపోకలకు అంతరాయం

..మిగతా 2లో

## ఉద్యమనేత కేసిఆర్‌తోనే రాష్ట్ర ప్రగతి



చేవెళ్ల బిఆర్ఎస్ నాయకులతో సమావేశమైన మాజీ మంత్రి సబితా రెడ్డి

### మాజీ మంత్రి సబితా రెడ్డి

చేవెళ్ల నియోజకవర్గ పార్టీకి బలమైన నాయకత్వం ఉంది: మాజీ మంత్రి సబితా రెడ్డి
15 రోజులకొక్కసారి చేవెళ్ల నియోజకవర్గములో పర్యటిస్తా..
పార్టీకి పటిష్టమైన క్యాడర్, లీడర్‌లు ఉన్నారు.
తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్ మార్గదర్శనంలో ప్రజా సమస్యలపై పోరాడుదాం.!
గ్యారెంటీల పేరుతో ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దాం..
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి
అందరికీ అందుబాటులో ఉంటా.. పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

చేవెళ్ల,జులై 01(ప్రభాత ఉదయం): చేవెళ్ల మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు,ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు సోమవారం మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నివాసంలో భేటి అయ్యారు.ఈ సందర్భంగా వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. పార్టీ

..మిగతా 2లో



## హైకోర్టులో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు ఉక్కెదురు

### విద్యుత్ విచారణ కమిషన్ రద్దు పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, జులై 1 (ప్రభాత ఉదయం): తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఎదురుదెబ్బ తగిలింది. విద్యుత్ విచారణపై వేసిన కమిషన్ ను రద్దు చేయాలంటూ కేసీఆర్ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ప్రభుత్వ వాదనలకు న్యాయస్థానం ఏకీభవించింది. విద్యుత్ అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్ విచారణపై కేసీఆర్ సవాల్ చేశారు. దీనిపై విచారించిన కోర్టు సోమవారం కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వెలువరించింది. విద్యుత్ కొనుగోలు అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషన్ విచారణను కేసీఆర్ సవాల్ చేశారు. ఇరువైపుల వాదనలూ విన్న న్యాయస్థానం ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ కేసీఆర్ పిటిషన్‌ను కొట్టేసింది. హైకోర్టులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై మూడు రోజుల ముందే వాదనలు

..మిగతా 2లో

## సంజయ్ పార్టీ వీడడంతో జగిత్యాలకు శని వదిలింది

ఎంగిలిమెతుకుల కోసం సంజయ్ ఎగిరి పోయిండు
కవిత సమా అనేకమంది ఆయనను లీడర్ చేసింద్రు
జీవన్ రెడ్డి కూడా చేరికలను ఆహ్వానించడం లేదు
దమ్మంటే ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి
గతంలో మేము బాజాప్తా పార్టీని విలీనం చేయించాం
జగిత్యాల బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో కెటిఆర్

2



ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

## లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి

# ధన్యవాద తీర్మానం

మొదటి పేజీ తరువాయి...





వర్షం కురిసింది. నోట్ల రద్దు వల్ల యువత ఉపాధి కోల్పోయింది. జీఎస్టీ వల్ల వ్యాపారులు, ప్రజలు అనేక బాధలు పడ్డారు. వీటి వల్ల దేశప్రజలకు కలిగిన లాభం ఏంటని విపక్షనేత రాహుల్ ప్రశ్నించారు. హిందుత్వ పేరుతో దేశ ప్రజలను బీజేపీ భయపెడుతోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ మణిపూర్ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. మణిపూర్‌లో అంతర్యుద్ధం జరుగుతుందన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను గాలికొదిలేశారని పేర్కొన్నారు. బడా పారిశ్రామికవేత్తల కోసమే పనిచేస్తున్నారని ఫైర్ అయ్యారు. తాను దేవుడితో నేరుగా మాట్లాడతానని మోదీ చెప్పారు.. నోట్ల రద్దు చేయాలని దేవుడే మోదీకి చెప్పి ఉంటారంటూ రాహుల్ పేర్కొన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను సర్వనాశనం చేశారని.. ఉద్యోగాలు లేక యువత అల్లాడుతోందన్నారు. అగ్నివీర్ పథకంపై తీవ్ర విమర్శలు చేశారు. అగ్నివీర్ జవాన్లు యుద్ధంలో చనిపోతే అమర జవాన్ హోదా లభించదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ సారి గుజరాత్ లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని.. రాసిపెట్టుకోండంటూ రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రైతులను పట్టించుకోలేదని.. 700 మంది చనిపోయారని తెలిపారు. అయోధ్యలో భూముల్ని లాక్కొని విమానాశ్రయం నిర్మించారంటూ ఆరోపించారు. అయోధ్య బీజేపీ సొత్తు కాదని,.. ఇదే అంశాన్ని ప్రజలు ఎన్నికల్లో ప్రూవ్ చేసారని అన్నారు. అయోధ్యలో ప్రజల్ని మందిరం దగ్గరకు కూడా రానివ్వలేదని మండిపడ్డారు. అయోధ్య ఓపెనింగ్ కి కార్పొరేట్ పెద్దలను మాత్రమే ఆహ్వానించారని అన్నారు.అక్కడ అంబానీ, అదానీలు మాత్రమే ఉన్నారని అన్నారు. రామజన్మ భూమి బీజేపీకి మాత్రమే సొంతం కాదని ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. మోదీ వారణాసిలో బతికి బయటపడ్డారని అన్నారు. హిందూ సమాజం అంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాత్రమే కాదని అన్నారు. హిందూ సమాజం అంటే ఒక్క మోదీనే కాదని, సభలో ఉన్నవారు, బయట ఉన్నవారంతా హిందువులే అని అన్నారు. కాగా.. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. తన మైకును ఎందుకు కట్ చేస్తున్నారని రాహుల్ ప్రశ్నించారు. రాహుల్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ , అమిత్‌షా మండిపడ్డారు. దేశ ప్రజలను ఎమ్మర్జెన్సీ పేరుతో జైల్లో పెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు అమిత్‌షా. సిక్కుల ఊచకోతను మర్చిపోయారా అని రాహుల్‌ను ప్రశ్నించారు. రాహుల్ తన వ్యాఖ్యలకు దేశ ప్రజలకు , హిందువులకు క్షమాపణ చెప్పాలన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు అభ్యంతరం తెలిపారు.. రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ ఎంపీ దూబే స్పీకర్ ను కోరారు.

## యువతకు దిక్సూచి సుభాష్ చంద్రబోస్

**ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి**
**కొత్తకోటలో సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణ**
**హాజరైన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు**



సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

కొత్తకోట, జూలై 1(ప్రభాత ఉదయం) దేశ యువతకు దిక్సూచిగా నిలిచిన మహోన్నత వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలోని దేవరకద్ర నియోజక వర్గంలోని కొత్తకోట మండల పరిషత్ ప్రాంగణంలో ఎంపీపీ గుంతా మౌనిక మల్లేష్ ఆధ్వర్యంలో శుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సి నవీన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కార్యక్రమంలో ఉద్దేశించి మాట్లాడుతూ... సుభాష్ చంద్రబోస్ , భారత స్వాతంత్ర్య ఉద్యమం అత్యంత ప్రముఖ నాయకులలో ఒకరని, తన శక్తివంతమైన నినాదాలు , ఉత్తేజకరమైన ప్రసంగాలతో లెక్కలేనన్ని వ్యక్తులను ప్రేరేపించిన ఒక ప్రభావవంతమైన శక్తి అని అన్నారు. బ్రిటీష్ వలస పాలన నుండి భారతదేశాన్ని విముక్తి చేయడంలో అచంచలమైన నిబద్ధతతో, స్వేచ్ఛా ఐక్య భారతదేశం కోసం అతని దృష్టిని సంగ్రహించే అనేక రకాల నినాదాలు అనుసరించేలా చేసిందని అన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ పాలక వర్గం ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని సన్మానం చేశారు. దేవరకద్ర ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, జడ్పిటిసిలు , మాజీ సర్పంచ్ లు, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



## నీట్ పరీక్షను రద్దు చేయాల్సిందే

### రాజ్‌భవన్‌ను ముట్టడించిన విద్యార్థి సంఘాలు

హైదరాబాద్, జులై 1 (ప్రభాత ఉదయం): విద్యార్థి, యువజన సంఘాల నేతల రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, ఎన్టీఏను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన ఐక్య కమిటీ ఆధ్వర్యంలో గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. అయితే అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు గవర్నర్ నిరాకరించడంతో రాజ్‌భవన్ ముట్టడికి నేతలు బయలు దేరారు. పీపుల్స్ ప్లాజా నుంచి రాజభవన్ వరకు ర్యాలీగా బయలుదేరిన విద్యార్థి సంఘాల నేతలను ఐమ్యాక్స్ సర్కిల్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే వారిని గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌కు తరలించారు. రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ సహా ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, వీజేఎస్, ఏఐపీఎస్‌యూ, పీవైసీ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వైజేఎస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైనా కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ పరీక్షలు రద్దు చేయకుండా మౌనంగా ఉండడం దుర్మార్గమని మండిపడ్డారు. గత 20 రోజుల నుంచి నీట్ విద్యార్థుల పక్షాన అన్ని సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా 70 వేలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాశారన్నారు. అపాయింట్‌మెంట్ అడిగినా కిషన్ రెడి స్పందించకపోవడంతో ఆయన ఇంటిని ముట్టడించామని తెలిపారు. స్టూడెంట్ మార్చ్ నిర్వహించామని.. సిగ్నేచర్ కాంపెయిన్ చేశామ నిన్న ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశామని చెప్పారు. గవర్నర్‌కు నీట్ విద్యార్థుల పక్షాన రిప్రెసెంటేషన్ ఇవ్వడానికి అపాయింట్‌మెంట్ కోరితే ఇవ్వలేదని.. అందుకే రాజ్‌భవన్ ముట్టడికి బయలుదేరమని వెల్లడించారు. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద మహా దీక్ష చేస్తామని హెచ్చరించారు. అప్పటికీ స్పందించకపోతే నీట్ కౌన్సిలింగ్ రోజు రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలకు బంద్ పిలుపునిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా ఎన్టీఏను, నీట్ పరీక్షలు రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని బల్మూర్ వెంకట్ స్పష్టం చేశారు.

## నల్లగొండ అభివృద్ధే లక్ష్యంగా

# పని చేస్తా

### రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, జులై 1 (ప్రభాత ఉదయం): నల్లగొండ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్ వద్ద మూడు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కె ఓ సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సబ్ స్టేషన్ నిర్మాణంతో వోల్టేజీ సమస్యను అధిగమించ వచ్చని తెలిపారు. రెండు నెలల్లో సబ్ స్టేషన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఇంజినీర్లను మంత్రి ఆదేశంచారు. నాణ్యమైన కేబుల్‌తో పాటు, ఫెన్సింగ్ వేయాలని, 24 గంటలు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఇబ్బందులు లేకుండా మరో మూడు సబ్ స్టేషన్లు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులనుఆదేశించారు. నల్లగొండ పట్టణంలో తాగునీటి సమస్యను అధికమించేందుకు 10 ఎంఎడీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.30 కోట్ల మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, ఆర్డీవో రవి, తదితరులు ఉన్నారు.

## ఐపీఎస్ అధికారులు బదిలీ

హైదరాబాద్, జులై 1 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం సోమవారం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాచలం కొత్తగూడెం ఓఎస్డీగా పరితోష్ పంకజ్, సిరిశెట్టి సంక్రీత్ గవర్నర్ ఏడీసీగా, ములుగు ఓఎస్డీగా గీతే మహేశ్ బాబాసాహేబ్‌ను నియమించింది. సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, భద్రచాలం ఏఎస్పీగా అంకిత్ కుమార్ శంఖవార్, భైంసా ఏఎస్పీగా అవినాశ్‌కుమార్, వేములవాడ ఏఎస్పీగా శేషాద్రినిరెడ్డి, ఏటూరు నాగారం ఏఎస్పీగా శివం ఉపాధ్యాయను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గత నెలలో ప్రభుత్వం పెద్ద ఎత్తున బదిలీలు చేసిన విషయం తెలిసిందే. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. పలుజోన్ల డీసీపీలను సైతం బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నది.



## సంజయ్ పార్టీ వీడడంతో

# జగిత్యాలకు శని వదిలింది

జగిత్యాల, జులై 1 (ప్రభాత ఉదయం): గాలికి కొట్టుకుపోయేది గడ్డిపోచలు మాత్రమే అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చురకలంటించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాలకు పట్టిన శని పోయిందని ఈ నియోజకవర్గ ప్రజలు ఉత్సాహంగా ఉన్నట్లు అనిపిస్తోందని అన్నారు. కొన్ని సందర్భాల్లో కష్టాలు వచ్చినప్పుడు మనషుల విలువ తెలుస్తది. గాలికి గడ్డపారలు కొట్టుకుపోవు. గట్టి నాయకులు కొట్టుకుపోరు. గాలికి కొట్టుకుపోయేది గడ్డిపోచలు మాత్రమే. గడ్డిపారల్లాంటి మీరు వెళ్లలేదు.. ఒక గడ్డిపోచ మాత్రమే కొట్టుకుపోయింది అని ఎమ్మెల్యే సంజయ్‌ను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. కవితక్కతో సహా వేలమంది కష్టపడితే ఆయన ఎమ్మెల్యే అయిండు. ఇప్పుడు ఆ ఎమ్మెల్యే దొంగల్లో కలిసిండు. రేవంత్ రెడ్డి విసిరే ఎంగిలి మెతులకు ఆశపడి పోయిండు. ఎమ్మెల్యే బుద్ధి ఇవాళ తెలిసి వచ్చింది. అభివృద్ధి కోసం పోయినా అని సంజయ్ అన్నాడు. జగిత్యాల జిల్లా రద్దు చేస్తా.. మెడికల్, నర్సింగ్ కాలేజీ రద్దు చేస్తా అని రేవంత్ రెడ్డి అన్నందుకు సంజయ్ కాంగ్రెస్‌లోకి వెళ్లిండా.. అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 4500 డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చినందుకు రద్దు చేయమని పోయావా..? ఏ అభివృద్ధి ఆశించి పోయిండు సంజయ్. ఆయన పోయింది ఒక్కదాని కోసం.. ఇయ్యంకుడి బిల్లులు రావాలి.. ఆయన క్రషర్ ఆగొద్దని పోయిండు. సొంత అభివృద్ధి కోసం పోయిండు.. జగిత్యాల అభివృద్ధి కోసం పోలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ సిగ్గు లేకుండా పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ ఆయారాం, గయారాం అనే విషబీజానికి శ్రీకారం చుట్టిందే ఇందిరాగాంధీ హయాంలోని కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. 2004లో మనతో పొత్తు పెట్టుకొని మన 26 మంది ఎమ్మెల్యేలలో 10 మంది ఎమ్మెల్యేలను కలుపుకునే పని చేసిందని అన్నారు. అయినా సరే 2014లో ఇదే కాంగ్రెస్‌తో కొట్లాడి కేసీఆర్ ఆధ్వర్యంలో మనం తెలంగాణ తెచ్చుకున్నామని అన్నారు. 2014లో ఇప్పుడున్న సీఎం రేవంత్ రెడ్డి మన ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేసింది మీరంతా చూశారు. తెలంగాణను నడిపియ్యలేకపోతున్నారని చెప్పేందుకు, ప్రభుత్వం స్థిరంగా లేదని సర్కార్ ను పడగొట్టే ప్రయత్నం చేశారు. ఆ పరిస్థితుల్లో రాజ్యాంగ బద్దంగా మూడింట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలు మన పార్టీలో చేరారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే విధంగా మనం వ్యవహరించలేదు. అప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ లో చేరినప్పుడు ఇదే రేవంత్ రెడ్డి వాళ్లను రాళ్లతో కొట్టి చంపాలన్నాడు.÷శివంత్ రెడ్డి ఇప్పుడు చెప్పాలె? ఎవరిని రాళ్లతో కొట్టాలే? ఎవరు పిచ్చి కుక్క? ఇప్పుడు రేవంత్ రెడ్డిని కొట్టాలా? ఇక్కడి ఎమ్మెల్యే సంజయ్ ను కొట్టాలా? రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే, నీవు మగాడివైతే నువ్వు తీసుకున్న ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలన్నారు. వాళ్లను మళ్లీ గెలిపించుకుంటే నువ్వు దమ్మునోడివి. ఒక్క రేవంత్ రెడ్డి మాత్రమే కాదు. రాహుల్ గాంధీ ఏమన్నాడో కూడా వినాలె. ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీలో చేరితే ఆటోమేటిక్ గా సభ్యత్వం రద్దు అయ్యేలా చేస్తామని హైదరాబాద్ లోనే చెప్పిండు. పాంచ్ న్యాయ్ పేరుతో ఇదే అంశాన్ని రాహుల్ గాంధీ మేనిఫెస్టోలో కూడా పెట్టిండు. కానీ ఇప్పుడు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేస్తుందేమిటీ ప్రజలు గుర్తించాలని అన్నారు. వాళ్ల పార్టీ నాయకుడు జీవన్ రెడ్డి కూడా ఇదే అంశంపై సొంత పార్టీ పై విమర్శలు చేశాడు. బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడాల్సిన, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలోకి వచ్చింది. మూడోసారి మూడో వంతు సీట్లలో గెలిచింది. 14 సీట్లలో కొద్ది తేడాతో మాత్రమే ఓడిపోయింది. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో ఏం జరిగిందో మీకు తెలుసు? మోదీ కావాలా? వద్దా? అన్నట్లుగా ప్రచారం చేశారు. దీంతో ఐతే ఎన్డీయే, ఇండియా కూటమి లో లేని పార్టీలకు ఇబ్బంది జరిగింది. ఒక్క బీఆర్ఎస్ కు మాత్రమే కాదు. ఏ కూటమిలో లేని సీపీఎం, వైఎస్ఆర్ సీపీ, బీజేడీ, అన్నాడీఎంకే, బీఎస్పీ, అకాలీదల్ లకు కూడా ఎదురుదెబ్బ తగిలిందన్నారు. 20 హామీలు ఇచ్చి రేవంత్ రెడ్డి గద్దెనెక్కిండు. వాటికి సంబంధించి ప్రజలు నిలదీస్తే.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లోనే ముసలం పుడుతుందని రేవంత్ భయపడ్డాడు. అందుకే ఎమ్మెల్యేలను గొర్రెలు, బర్రెల మాదిరిగా డబ్బులు పడేసి కొని తన దొడ్లో కట్టేసుకుంటున్నాడు. ఇచ్చిన హామీలను డైవర్ట్ చేసేందుకు ఎమ్మెల్యేలను ఎత్తుకుపోతుండు. జగిత్యాల కార్యకర్తలను చూస్తే సంతోషంగా ఉంది. జగిత్యాలకు పట్టిన శని పోయిందన్నట్లుగా ధైర్యంగా కనిపిస్తున్నారు. కుండ పగిలితే పగిలింది. కానీ కుక్క బుద్ధి తెలిసిందన్నట్లుగా మీ ఎమ్మెల్యే బుద్ధి తెలిసింది' అని కేటీఆర్ మాట్లాడారు.



మాజీ మంత్రి సబితా రెడ్డి సమక్షంలో చేరిన వివిధ పార్టీల నాయకులు

## ఉద్యమనేత కేసీఆర్‌తోనే రాష్ట్ర ప్రగతి

మొదటి పేజీ తరువాయి...

క్యాడర్ ప్రస్తుత పరిస్థితుల్లో ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని,త్వరలో నియోజక వర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ ఎప్పటికప్పుడు ఎండగడదామన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చి,కాంగ్రెస్ ద్వారా జరిగిన మోసాన్ని గుర్తించి తిరిగి బీఆర్ఎస్‌ను ఆదరిస్తారని చెప్పారు.అప్పటి దాకా ఓపికతో ప్రజా సమస్యలపై దృష్టిసారించి,పట్టుదలతో ప్రజల నడుమనే జీవించాలని పార్టీ శ్రేణులకు ఆమె దిశ నిర్దేశం చేశారు.కొంతమంది నాయకులు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి నష్టం రాదని స్పష్టంచేశారు.రానున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు నడవలన్నారు.సబితా ఇంద్రారెడ్డిని కలిసిన వారిలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి,మాజీ జడ్పీటీసీ బాలరాజు,పార్టీ అధ్యక్షులు ప్రభాకర్,దేశమొల్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## హైకోర్టులో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు ఉక్కెదురు

మొదటి పేజీ తరువాయి...

ముగిశాయి. అయితే ఆ రోజున హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. అసలు కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్–తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ సంఘాన్ని నియమించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని ఇవాళ హైకోర్టు కొట్టివేసింది.

## అమల్లోకి వచ్చిన

# కొత్త న్యాయవ్యవస్థ

మొదటి పేజీ తరువాయి...

కలుగుతోంది. దాంతో దానిని వేరేచోటుకు తరలించమని అతడికి పోలీసులు పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేకపోయింది. దానివల్ల ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను వీడియో తీసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆ వీధి వ్యాపారిని బిహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ కొత్త చట్టాల ప్రకారం.. క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా కచ్చితంగా తీర్పు వెలువడాలి. తొలి విచారణ జరిగిన 60 రోజుల్లోపు అభియోగాలు నమోదు చేయాలి. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కోసం కొత్త అధ్యాయాన్ని చేర్చారు. కొత్త చట్టాల ప్రకారం.. చిన్నారులపై సామూహిక అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష లేదా యావజ్జీవశిక్ష పడనుంది. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడం, చిన్నారులపై సామూహిక అత్యాచారం, మూకదాడి తదితర నేరాలకు ఇంతకుముందు ఐపీసీలో ప్రత్యేకంగా సెక్షన్లు లేవు. దీంతో గందరగోళం ఏర్పడేది. భారతీయ న్యాయ సంహితలో ఆ లోటును పూడ్చారు.

## సుభాష్ చంద్రబోస్ ఆశయాల కోసం యువత ముందుకు సాగాలి: ఎమ్మెల్యే జీఎంఆర్

**ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసిన సందర్భంగా సన్మానం చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్**

కొత్తకోట, జూలై 1(ప్రభాత ఉదయం) సుభాష్ చంద్రబోస్ ఆశయాల కోసం నేటి యువత ముందుకు సాగాలని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. సోమవారం కొత్తకోట మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధులు సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి , వనపర్తి జిల్లా పరిషత్తు చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి , వనపర్తి జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్ వామన్ గౌడ్ , ఎంపీపీ గుంత మౌనిక , తదితరులు పాల్గొన్నారు.



సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే జిఎంఆర్, ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్



ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియటంతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# ఘనంగా శ్రీ మాతా పోచమ్మ దేవాలయ 17వ వార్షికోత్సవాలు



రాజేంద్రనగర్ శ్రీ పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న వివిధ పార్టీల నాయకులు వై శ్రీధర్, డి ఉమారెడ్డి, ఎం యాదమ్మ, పి వెంకటస్వామి, కె. రమేష్ తదితరులు




అన్న దాన కార్యక్రమం

బుద్వేల్, జూలై1(ప్రభాత ఉదయం) : కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ......భక్తుల కొంగు బంగారంగా .....పేరుగాంచిన రాజేంద్రనగర్ శ్రీ మాత పోచమ్మ దేవాలయ 17వ వార్షికోత్సవాలు సోమవారం అంగరంగ వైభవముగా జరిగాయి. దేవాలయ కమిటీ అధ్యక్షుడు దుంబాల ఉమా రెడ్డి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హోమాలు, కుంకుమార్చనలు, సహస్రనామ పారాయణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.



పూజలలో పాల్గొన్న భక్తులు



అమ్మ వారిని దర్శించుకున్న నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షుడు వేముల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటేష్, కోశాధికారి జి. వేణుగోపాల్ లు



సెప్టిక్ ట్యాంకు స్థలంలో ఇది జీహెచ్ఎంసి స్థలమంటూ బ్యానర్ కట్టిన రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు

## కాలనీకి చెందిన కమ్యూనిటీ స్థలాన్ని కాపాడిన అధికారులు

బుద్వేల్, జూలై1(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ గోల్డెన్ హైట్స్ కాలనీ రోడ్ నెంబర్ 6 లో గతంలో సెప్టిక్ ట్యాంకు కోసం వదిలిన 200 గజాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేయాలని ప్రయత్నించగా అది జీహెచ్ఎంసి కి చెందిన స్థలమే అంటూ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు సోమవారం ఆ స్థలంలో బ్యానర్ కట్టారు. డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ సూచనలతో టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఏసీపీ అబ్దుల్ ఖాదర్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ నరేందర్ గౌడ్, ఏఈ వెంకోబా లు సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని పరిశీలించి , పక్కనే నివాసం ఉండే వారి ఇంటి పేపర్లను చూసి ఖాళీగా ఉన్న స్థలం సెప్టిక్ ట్యాంకు కోసం కేటాయించినదేనని రుజువు చేసుకొని ఆ స్థలంలో బ్యానర్ కట్టారు. జీహెచ్ఎంసి స్థలంలో కబ్జాదారుల ఆటలు సాగనివ్వమని టౌన్ ప్లానింగ్ ఏసిపి అబ్దుల్ ఖాదర్ తెలిపారు.



## శంషాబాద్ డిసిపి రాజేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన బక్క శ్రీకాంత్

శంషాబాద్,జూలై 1( ప్రభాత ఉదయం) శంషాబాద్ జోన్ డిసిపి గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజేష్ ను తొండు పల్లి కి చెందిన యువజన నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. టిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ టిఆర్ఎస్ యువత వైస్ ప్రెసిడెంట్ బక్క శ్రీకాంత్ తో పాటు పలువురు ఆయనను కలిసి పుష్పగుచ్ఛన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన శంషాబాద్ కు సమర్థవంతమైన అధికారి రావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు .

## కవ్వగూడ పాఠశాల విద్యార్థులకు పెన్నులు పెన్సిళ్లు పలకలు నోటుబుక్కులు పంపిణీ



శంషాబాద్, జూలై 1( ప్రభాత ఉదయం) కవ్వా గోడ గ్రామపంచాయతీ యువ నాయకుడు కుక్కల బాలు ముదిరాజ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు పలకలు. పాఠ్యపుస్తకాలు. పెన్నులు. పెన్సిళ్లు పంపిణీ చేశారు. కవ్వగూడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని. విద్యార్థులకు నోటు బుక్కులు, పెన్నులు, పెన్సిలు పలుకలు, బాలు ముదిరాజ్ తన సొంత డబ్బులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలు ముదిరాజ్ మాట్లాడుతు ప్రతి ఒక్కరూ విద్యావంతులు అయితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రతి పౌరుడు కూడా ఉన్నత చదువులు చదువుకోవడం కోసం పేద మధ్యతరగతి విద్యార్థులకు తన వంతు సహాయం చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నతమైన ఉద్యమం అందించడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## అసాంఘిక శక్తుల పట్ల ప్రత్యేకంగా నిఘా: ఇన్ స్పెక్టర్ కె కాస్ట్రో

### రాజేంద్రనగర్ నూతన సీఐ కె.కస్ట్రో బాధ్యతలు స్వీకరణ..




రాజేంద్రనగర్, జూలై 1(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా కె.కాస్ట్రో ఆదివారం రాత్రి బాధ్యతలు చేపట్టారు.రాజేంద్రనగర్ సీఐగా విధులు నిర్వహిస్తున్న బి.నాగేంద్రబాబు సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ కి బదిలి అయ్యారు.సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఎలక్షన్ సెల్ విధులు నిర్వహిస్తున్న కె.కాస్ట్రో ను రాజేంద్రనగర్ సీఐగా బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా సీఐ కె.కస్ట్రో మాట్లాడుతూ... అసాంఘిక శక్తుల పట్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు.ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకు ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## సులేమాన్ నగర్ 242 పిల్లర్ వద్ద ఓ వ్యక్తిపై కత్తిపోట్లు



కత్తిపోట్లకు గురైన అబ్దుల్ నబీ

బుద్వేల్, జూలై1(ప్రభాత ఉదయం): రోడ్డుపై వెళ్తున్న సందర్భంగా ఒకరికి ఒకరు తగులుకొని గొడవపడ్డారు . ఈ గొడవలో సులేమాన్ నగర్ లాల్ డాబా ప్రాంతానికి చెందిన సల్మాన్ (25) అనే వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన అబ్దుల్ నబీ (40) పై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి 245 పిల్లర్ వద్ద జరిగింది. ఈ గొడవలో అబ్దుల్ నబీ కి తీవ్ర గాయాలయ్యాయి . ఆయనను స్థానికులు అత్తాపూర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ ఎస్సై వెంకన్న సల్మాన్ కోసం గాలిస్తున్నారు.

## దొంగతనం చేసిన ఇద్దరికీ సంవత్సరం జైలు శిక్ష, రూ 500 జరిమానా

బుద్వేల్, జూలై1(ప్రభాత ఉదయం): శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్(ఆర్జీఐ ఏ) పరిధిలోని ఈఎస్ఐ డిస్పెన్సరీ లో 2023 సెప్టెంబర్ 28న జరిగిన దొంగతనం కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరికీ 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జేవిఎస్ రాజ్ కిరణ్ సోమవారం ఒక సంవత్సరం కారాగార శిక్ష, రూ. 500 ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి..... శంషాబాద్ ఆర్జీ ఏ ఐ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీలో 2023 సెప్టెంబర్ 28న దొంగతనం జరిగింది. సీసీటీవీ సెట్, మానిటర్, రౌటర్స్, హార్డ్ డిస్క్ లు చోరీ అయ్యాయి . ఈ కేసు నమోదు చేసుకున్న ఆర్జీఏఐ పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. కాటేదాన్ బాబుల్ రెడ్డి నగర్ పోచమ్మ దేవాలయం సమీపంలో నివాసం ఉండే సుమిత్ అలియాస్ సోను సింగ్( 33 ), వారాసిగూడ, బౌద్ధ నగర్, సికింద్రాబాద్ లో నివాసం ఉండే అహ్మద్ జహంగీర్ మహమ్మద్ (39) లు నిందితులుగా గుర్తించారు. విచారణ జరిపిన అనంతరం నిందితులిద్దరికీ ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జేవిఎస్ రాజ్ కిరణ్ తీర్పునిచ్చారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా సంగీత వ్యవహరించారు.

## 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల జిల్లా ప్రతినిధి,జూలై1(ప్రభాత ఉదయం)అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. గద్వాల పట్టణానికి చెందిన అనిల్ కుమార్ రేషన్ బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్నాడు. తెల్లవారుజామున 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో వేసుకొని రాయచూరుకు బయలుదేరాడు. గద్వాల పట్టణ పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కన్పించడంతో ఆటోను ఆపి, రేషన్ బియ్యం గుర్తించి, అనిల్ ను అదుపులోకి తీసుకున్నారు. బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు



ఉప్పర్‌పల్లిలో గల శ్రీ సాయినాథ స్వామి ఆలయం



ఆలయంలో కొలువుదీరిన శ్రీ షిరిడీ సాయిబాబా

## నేడు ఉప్పర్‌పల్లిలో శ్రీ సాయినాథ స్వామి ఆలయం వార్షికోత్సవాలు

బుద్వేల్, జూలై1(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి బస్ స్టాప్ లో గల మహాగణపతి పూర్వక శ్రీ గురు దత్తాత్రేయ సహిత శ్రీ సాయినాథ స్వామి వార్ల దేవాలయ ప్రథమ వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ ధర్మకర్త సామ ఇంద్రపాల్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్వామివార్లకు వార్షికోత్సవ పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మంగళ వాయిద్యములు , పంచామృత అభిషేకం , అష్టోత్తర కలశాభిషేకం లాంటి పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆలయ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## నక్షబాటను రియాల్టర్ దర్జాగా కబ్జా..!

### ఇదెక్కడి దౌర్జన్యం.. బడా రియాల్టర్ అయితే దాసోహం అనడమేనా!

### భూ యజమాని లంకల సంజీవరెడ్డి..



కోర్టు ఆర్డర్‌ను బేకాతర చేస్తూ స్థలంలో అక్రమంగా పోల్స్ పాతుతున్న కబ్జాదారులు

బండ్లగూడ,జులై1(ప్రభాత ఉదయం) నాక్షబాటతోపాటు కోర్టులో పరిధిలో ఉన్న స్థలంలో రోడ్డును ఓ రియాల్టర్ దర్జాగా కబ్జా చేస్తూ ప్రహరిని నిర్మిస్తున్నాడని స్థల యజమాని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లంకల సంజీవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.కోర్టులో వివాదం ఉన్న పట్టించుకోకుండా నిర్మాణాలను ప్రారంభించడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు.కిస్మత్పూర్ లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గండిపేట్ మండల కిస్మత్పూర్ లో అశోక బిల్డర్స్,లీగ్ బిల్డర్స్ సంస్థలు విల్లాల నిర్మాణాలను ప్రారంభించాయన్నారు.రియాల్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈ పనులను చేపడుతున్నారని తెలిపారు.సోమవారం ఉదయం 6 జెసిబిలతో పాటు ట్రాక్టర్లతో వచ్చిన వందలాదిమంది కార్మికులు గ్రామం గుండా తమ పొలంలోకి వెళ్లే నక్షబాటను కబ్జా చేస్తూ నిర్మాణాలను ప్రారంభించాడని ఆరోపించారు. అందరూ నడిచే రోడ్డు అయినప్పటికీ రియాల్టర్ ఇదేది పట్టించుకోకుండా భారీ షెడ్లను వేస్తూ నిర్మాణాలను చేపడుతున్నాడని సంజీవరెడ్డి వెల్లడించారు.దీంతోపాటు సర్వేనెంబర్ 15,16, 17,20,22,23 లోని 14 ఎకరాల14 గుంటల స్థలా విషయమై కోర్టులో వివాదం నడుస్తుందన్నారు.(రంగారెడ్డి జిల్లా 5వ 11వ అడిషనల్ డిస్టిక్ కోర్టుతో పాటు ప్రిన్సిపల్ అడిషనల్ కోర్టులో ఓఎస్ నంబర్ 664/23..886/23..78/24..364/24 ) అయినప్పటికి రియాల్టర్ కోర్టు ఉత్తర్వులను సైతం పట్టించుకోకుండా పనుల నిర్వహిస్తున్నాడని ఆరోపించారు.ఈ విషయంలో అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ బడా రియాల్టర్ మూసి పరివాహక ప్రాంతాన్ని కబ్జా చేయడంతో పాటు బఫర్ జోన్ లో విల్లాలను నిర్మించాడని స్థానికులు గతంలో అనేక ఫిర్యాదులు చేశారని గుర్తు చేశారు.పత్రికల్లో సైతం కథనాలు వచ్చాయని వెల్లడించారు.కానీ ఇరిగేషన్ తోపాటు మూసి డెవలప్మెంట్ అథారిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.మూసి అథారిటీ,ఇరిగేషన్,రెవిన్యూ,బండ్లగూడ కార్పొరేషన్ అధికారులు ఈ విషయంలో వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.నిర్మాణ పనులను వెంటనే ఆపివేసి నాక్షబాటాను పునరుద్ధరించాలని కోరారు.

## జలమండలిలో 51 మంది ఉద్యోగులు పదవీ విరమణ




పదవి విరమణ చేసిన డైరెక్టర్ అజ్మీర కృష్ణ, సీజీఎం శ్రీధర్ రెడ్డిలను సన్మానిస్తున్న అధికారులు



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న జలమండలి, అధికారులు సిబ్బంది

హైదరాబాద్, జూలై1(ప్రభాత ఉదయం) జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 51 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. వీరిలో ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 గా విధులు నిర్వర్తించిన అజ్మీరా కృష్ణ, ఓ అండ్ ఎం డివిజన్ 7 సీజీఎం శ్రీధర్ రెడ్డి, ప్రాజెక్టు డివిజన్ జనరల్ మేనేజర్ రెహమాన్ సహా.. పలు స్థాయిల్లో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు.వీరందరిని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, ప్రాజెక్టు డైరెక్టర్ రఘు, డైరెక్టర్ ఆపరేషన్స్ - 1 విజయరావు, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఉద్యోగులు పాల్గొన్నారు.


## ఆదివారం అర్ధరాత్రి పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ వే పై కారు బోల్తా

### ఓ యువకుడు దుర్మరణం


బుద్వేల్, జూలై1(ప్రభాత ఉదయం): ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ వే పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన 295 పిల్లర్ మలుపు వద్ద జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మైలార్ దేవుపల్లి బృందావన్ కాలనీకి చెందిన బీరప్ప - రాణమ్మలకు పెద్ద కుమారుడు సాయి గణేష్( 25). జల్ పల్లిలో ప్లాస్టిక్ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి సంవత్సరం క్రితం కొన్న టీఎస్07 జే వీ 6055 థార్ కారులో గచ్చిబౌలిలో గల ఏఎంబీ మాల్‌లో సినిమా చూడడానికి వెళ్ళాడు. సినిమా చూసి రాత్రి 2గంటల ప్రాంతంలో ఇంటికి వస్తున్నాడు. రేతిబౌలి నుంచి పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ వే పై ఆరాంఘర్ వైపు వస్తుండగా, పిల్లర్ నెంబర్ 295 వద్ద మలుపుగా ఉన్న రోడ్డులో కారు వేగంగా వెళ్లి రోడ్డు మధ్యలో ఉన్న స్ట్రీట్ లైట్స్ స్తంభాన్ని ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా పల్టీలు కొట్టి కిందపడి పోయింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న సాయి గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ రోడ్డున పోయేవారు చూసి పోలీసులకు ఫిర్యాదు చేయగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు వచ్చి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. రాజేంద్రనగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

### రోడ్డు మలుపుగా ఉండడమే ప్రమాదానికి కారణం ?

పిల్లర్ నెంబర్ 295 వద్ద రోడ్డు మలుపుగా ఉండడమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కారు వేగంగా ఉండడం, మలుపు వద్ద కంట్రోల్ కాక పల్టీలు కొట్టి ఉంటుందని చెబుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన థార్ కారు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయి గణేష్



సంవత్సరం క్రితం కారు కొన్న సంతోషంలో సాయి గణేష్

### చేతికొచ్చిన కొడుకు మరణించడంతో మిన్నంటిన రోధనలు :


మైలార్ దేవ్ పల్లి బృందావన్ కాలనీకి చెందిన బీరప్ప, రాణమ్మలకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు సాయి గణేష్ చేతికొచ్చి తమకు అండగా ఉంటాడని భావిస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తల్లిదండ్రుల రోధనలు చూసి బృందావన్ కాలనీవాసులు కన్నీరు మున్నీరయ్యారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్



మృతి చెందిన టిడిపి నాయకుడు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి





మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రావుల

కొత్తకోట, జూలై 1(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కనాయపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దారమోని గోపాల్ , తోకలి రవి ల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జిఎంఆర్ పరామర్శించి గాడ సంతాపాన్ని తెలియజేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ఎమ్మెల్యే జిఎంఆర్ కాంగ్రెస్ నాయకులు జేసీబీ రాము ని వారి నివాసంలో కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

### బాధిత కుటుంబాన్ని పరమర్శించిన మాజీ ఎమ్మెల్యే రావుల ...

కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దారమోని గోపాల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. అన్ని విధాలుగా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, బిఆరెస్ గ్రామ అధ్యక్షులు హోటల్ రాజు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు రాములు, నాయకులు కుర్మయ్య,డిసి రాములు, వెంకట్ కుమార్, ధనుష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



బాధితుల నుండి వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

## బాధితులకు న్యాయం చేస్తాం: ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 1(ప్రభాత ఉదయం)శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వివిధ సమస్యల పై బాధితుల నుండి వచ్చిన 16 అర్జిలను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజావాణిలో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీసు స్టేషన్ ల అధికారులతో మాట్లాడుతూ పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిదిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిస్థితులకు భంగం కలిగించేవారి పట్ల, మహిళలకూ వ్యతిరేకంగా జరిగే నేరాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులలో భూమి ఆక్రమణకు సంబందించి -8 పిర్యాదులు, ఇంటిని ఇతరులు ఆక్రమించడం గురించి - 3 పిర్యాదులు, పంటను ధ్వంసం చేయడం గురించి - 01 పిర్యాదు, ఇంటి ప్రక్కను ప్లాట్ లో మురుగు నీరు నింపడం గురించి - 01 ఫిర్యాదు, వడ్డేపల్లి లోని 3 వ వార్డు లో ప్లాట్లు వేసుకొని వేసిన వెంచర్ లో వసతులు కల్పించక పోవడం గురించి - 1 ఇతర అంశాలకు సంబంధించి -02 పిర్యాదులు అందాయి.



వైద్యులను సన్మానిస్తున్న లక్ష్మీనివాస్

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన టి ఎస్ ఎస్ ఓ అధ్యక్షులు లక్ష్మీ నివాస్

కొత్తకోట, జూలై 1(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీ నివాస్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిలుగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టి ఎస్ ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నివాస్ మాట్లాడుతూ ...ప్రపంచంలో గొప్ప వృత్తి ఏదైనా ఉంది అంటే అది డాక్టర్ వృత్తే అని అన్నారు. అందుకే వైద్యులను దేవుళ్ళతో పోలుస్తారని చెప్పారు. చావు బతుకుల్లో ఉన్న వ్యక్తులకు జీవం పోసి ప్రాణాలు కాపాడే వారు వైద్యులని వీరి సేవలను వెలకట్టలేమని పేర్కొన్నారు. కరోనా సమయంలో వైద్యులు చేసిన సేవలు మరువలేనివని ఎందరో ప్రాణాలకు ఊపిరిపోసి మహనీయులు డాక్టర్లు అని వారి సేవలను కొనియాడారు. అదేవిధంగా వైద్యం అంటే వృత్తిగా కాకుండా మనుషుల్ని బ్రతికించే మహాశక్తిగా ప్రజలకు సేవ చేస్తున్న డాక్టర్లు అందరు దేవుళ్ళతో సమానమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీల మండల అధ్యక్షులు శ్రీశైలం, టిఎస్ఎస్ఓ రాష్ట్ర నాయకులు కర్రే సుదర్శన్, వెంకట్ కృష్ణ జోషి మెడికల్ ఆఫీసర్ ఆసియా బేగం, ఆయుష్ డాక్టర్ మంజుశ్రీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గద్వాల(మల్దకల్), జూలై 1(ప్రభాత ఉ దయం)వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుండడంతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిని డాక్టర్ స్వరూప రాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాసపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...సీజనల్ వ్యాధులపై గ్రామాలలో ఏ ఎన్ ఎం,ఆశావర్కర్లు,సూపర్ వైజర్లు,అప్రమత్తంగా ఉండి మలేరియా టైఫాయిడ్,డెంగ్యూ,చికెన్ గున్యా పలు వ్యాధులపై ఆమె అవగాహన కల్పించారు. త్రాగునీరు కాచి చల్లార్చి తాగాలి వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆమె అన్నారు. ఆహారపదార్థాలు వేడిగా వున్నప్పుడే భుజించాలని తెలియజేశారు. వారానికొకసారి ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీహెచ్ ఓ వెంకట స్వామి,సూపర్ వైజర్ శ్రీధర్,షేకమ్మ,పిహెచ్ఎన్ రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలు జారీ

కూకట్‌పల్లి, జూలై 1 (ప్రభాత ఉదయం) రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మూసాపేట డివిజన్ లోని శక్తి నగర్ లోని పార్క్ కమ్యూనిటీ హాల్ లను, అదేవిధంగా రామారావు నగర్ కాలనీ నుండి స్నేహపూరి కాలనీకి అనుసంధానంగా ఉన్ననాలా పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. అనంతరం మోతి నగర్ లోని వార్డు కార్యాలయంలో స్థానిక ప్రజలు కాలనీ అసోసియేషన్ల అధ్యక్షుల ఫిర్యాదులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ శక్తి నగర్ లోని కమ్యూనిటీ హాల్ పార్కులను వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలన్నారు. స్నేహపురి కాలనీ నాలా పనులలో జాప్యం జరగడం ద్వారా రానున్న వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయని, డివిజన్ లో ఎక్కువగా కాలనీలలో, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని తద్వారా దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దానిని నివారించడానికి ఎంటమోలజీ సిబ్బంది దోమల పిచికారి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డివిజన్ లోని జరుగు పనులకు నిధులను జిల్లా మంత్రులను కలిసి తీసుక వస్తామని, కానీ అధికారులు ఎలాంటి జాప్యం జరగకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రమేష్, డి.ఈ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, మాజీ కౌన్సిలర్ సిహెచ్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు నాగుల సత్యం ప్రధాన కార్యదర్శి తిరుపతి, కాలనీ అసోసియేషన్లు, అధ్యక్షులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య యత్నం

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 1(ప్రభాత ఉదయం)జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ లో రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం%ఔ%. అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన పరుశరాముడు 5 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన ఇతరులు కబ్జా చేసుకున్నారని ఆరోపిస్తూ గతంలో పలుమార్లు ప్రజావాణిలో విన్నపించుకున్నారు అయినా అధికారులు పట్టించుకోవడంలేదని మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అతనికున్న ఐదు ఎకరాల భూమిని ఇదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేయడంతో, పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన ఫలితం లేకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నాకి ప్రయత్నించాడు. దీంతో అక్కడున్న పోలీసులు ఆ రైతును చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఏది ఏమైనా ప్రతి ప్రజావాణిలో భూ సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినా పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు పేర్కొన్నారు.

## ఆక్యుపంక్చర్ థెరపిస్ట్ క్లినిక్‌పై డిఎంహెచ్‌ఓ సిబ్బంది తనిఖీలు



ఆక్యుపంచర్ వైద్యశాలను తనిఖీ చేస్తున్న వైద్య శాఖ అధికారులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 1(ప్రభాత ఉదయం)ఎలాంటి అనుమతులు లేకుండా ఆక్యుపంక్చర్ థెరఫి సెంటర్ నిర్వహిస్తున్న ఓ క్లీనిక్ పై సోమవారం జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారులు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. వివరాలకు వెళ్లితే... కర్నూల్ కు చెందిన ప్రొఫెషర్ షేక్ బాష గద్వాలలో ఆక్యుపంక్చర్ థెరపీ సెంటర్ క్లీనిక్ లో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తుండటంతో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వందలాది రోగులు తరలివచ్చారు. కాగ ఆక్యుపంక్చర్ థెరపిస్ట్ క్లినిక్ నిర్వహించుటకు అనుమతులు లేకపోవడంతో డిఎంహెచ్ఓ డాక్టర్ శశికళ ఆదేశాల మేరకు సిబ్బంది కె. మధుసూదన్ రెడ్డి, నరసయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 మరియు రూల్స్ -2011 ప్రకారము రిజిస్ట్రేషన్ చేసుకోలేదు కాబట్టి జిల్లా అధికారులు షేక్ బాషాని క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం క్లినిక్ ని రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. లేనిచో యాక్టు ప్రకారం కఠిన చర్యలు చట్టరీత్యా తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా బిల్డింగ్ యజమాని కి కూడా అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహించుటకు పర్మిషన్ ఇవ్వరాదని ఇచ్చినచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి మందులు వాడకుండా కేవలం అరచేతిపై ఉండే క్రషర్ పాయింట్స్‌పై నొక్కడం ద్వారానే రోగాలు నయం అవుతాయని ఆక్యుపంక్చర్ థెరఫిస్ట్ షేక్ బాషా పేర్కొన్నారు.





## ఈషా ఆసుపత్రిలో డెంటల్ విభాగం ప్రారంభం



శంషాబాద్, జూలై 1( ప్రభాత ఉదయం ) శంషాబాద్ పట్టణంలోని ఈషా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన దంత వైద్య విభాగాన్ని సోమవారం ప్రారంభించారు. డెంటల్ వైద్య నిపుణులు డాక్టర్ వినయ్ రావు ఆధ్వర్యంలో ఈ విభాగాన్ని నడపనున్నట్టు ఆస్పత్రి ఎండి. డాక్టర్ పులిపాటి శశికాంత్ తెలిపారు శంషాబాద్ లో డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్కుడ గ్రామంలోని ఓయాసిస్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు శంషాబాద్ లోని ఈషా హాస్పిటల్ కు వచ్చి డాక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పులిపాటి శశికాంత్ నేతృత్వంలో ఆసుపత్రి డాక్టర్లు శ్రీనివాసమూర్తి. డాక్టర్ పునీత్. డాక్టర్ రాకేష్ లు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. నూతనంగా ఏర్పాటు చేసిన డెంటల్ విభాగంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

## దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటా

### సొంత నిధులతో హనుమాన్ దేవాలయ స్లాబ్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్..



కూకట్‌పల్లి, జూలై 1 (ప్రభాత ఉదయం) ఫతేనా డివిజన్ పరిధిలోని ప్రభాకర్ రెడ్డి నగర్ లో 150 ఎస్ క్యూ డి లో హనుమాన్ దేవాలయం పునర్మిస్తున్నందున అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ని దేవాలయానికి పై కప్పు వేయించమని కోరారు. స్పందించిన కార్పొరేటర్ దేవాలయాల అభివృద్ధికి తాము ఎప్పటికీ మందుంటామని స్లాబ్ యొక్క ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. సోమవారం హనుమాన్ దేవాలయానికి స్లాబు పనులను పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో సాగర్, రామ్ రెడ్డి, దత్తు, భాఖి, విష్ణు ముదిరాజ్, రాజ్ కుమార్, మహేందర్, చాంద్, కన్నయ్య, సుధాకర్ రెడ్డి, రాజు, రాములు, సాయి కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

### కలియుగ దైవాలు వైద్యులు... కూకట్ పల్లి జనసేన పార్టీ అధ్యక్షులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్...

కూకట్‌పల్లి, జూలై 1 (ప్రభాత ఉదయం) డాక్టర్స్ డే పురస్కరించుకొని కెపిహెచ్బి ఐదవ ఫేస్ వద్ద లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ( లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ - మెగా సిటీ మరియు యువభారత్ ) వారి ఆధ్వర్యంలో డాక్టర్స్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై వైద్య వృత్తిలో ఎన్నో సేవలు అందించిన డాక్టర్ మల్లేశ్వర రావుని, డాక్టర్ రఘుపతి, డాక్టర్ సూర్య ప్రకాష్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ తేజశ్రీని పూలలుమాలవేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, అనిల్ కుమార్ రెడ్డి, చెన్నారెడ్డి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నీట్ కౌన్సిలింగ్‌కి వ్యతిరేకంగా ఈ నెల 6వ తేదీ

## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్

### పిలుపునిచ్చిన తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్. రాజ్ భవన్ ముట్టడికి బయలుదేరిన విద్యార్థి, యువజన సంఘాల నేతలు... అదుపులోకి తీసుకున్న పోలీసులు..




కూకట్‌పల్లి, జూలై 1 (ప్రభాత ఉదయం) నీట్ పరీక్షను రద్దు చేసిన మళ్లీ నిర్వహించాలని, ఎన్ టి ఏ ను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన ఐక్య కమిటీ అధ్వర్యంలో గవర్నర్ అపాయింట్మెంట్ కోరారు. గవర్నర్ అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం తో పీపుల్స్ ప్లాజా నుండి రాజభవన్ వరకు సోమవారం విద్యార్థి సంఘాలు ర్యాలీ గా బయలుదేరి రాజ్ భవన్ ముట్టడికి ప్రయత్నించారు. ఐమ్యాక్స్ సర్కిల్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారిని గోషామహల్ పోలీస్ గ్రౌండ్ కి తరలించారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైన కేంద్ర ప్రభుత్వం, ఎన్ టి ఏ పరీక్షలు రద్దు చేయకుండ మౌనంగా ఉండడం దుర్మార్గంఅని అన్నారు. గత 20రోజుల నుండి నీట్ విద్యార్థుల పక్షాన అన్ని సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్రం నుండి కూడా 70 వేలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని తెలిపారు. అపాయింట్మెంట్ అడిగిన కిషన్ రెడ్డి స్పందించకపోవడం తో ఆయన ఇంటిని ముట్టడించామని, స్టూడెంట్ మార్చ్ నిర్వహించామని, సిగ్నిచర్ కాంపెయిన్ చేశామని, ఢిల్లీ లో పార్లమెంట్ ముట్టడి చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశామని, గవర్నర్ కి నీట్ విద్యార్థుల పక్షాన రిప్రెసెంటేషన్ ఇవ్వడానికి అపాయింట్మెంట్ కోరితే ఇవ్వలేదని, అందుకే రాజ్ భవన్ ముట్టడికి బయలుదేరమని తెలిపారు. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే అన్ని విద్యార్థి సంఘాల అధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద మహా దీక్ష చేస్తామని, అప్పటికి స్పందించకపోతే నీట్ కౌన్సిలింగ్ రోజు రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలకు బంద్ పిలుపునిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్,ఎన్ ఎస్ యు ఐ, ఎస్ ఎఫ్ ఐ, ఏఐఎస్ఎఫ్, పి డి ఎస్ యు, వి జె ఎస్, ఏఐపిఎస్యు, పి వై సి, డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పి వై ఎల్, వై జె ఎస్ నేతలు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.